క్లుప్తంగా

యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడిగా విజయ్‌కుమార్

సాలూరు రూరల్: మండలానికి చెందిన ఉపాధ్యాయుడు బి.విజయ్‌కుమార్ యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పార్వతీపురంలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

60 మందికి వైద్యసేవలు


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ ఉష

సీతానగరం: మండలంలోని అంటిపేట గ్రామంలో 104 ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉష సుమారు 60 మంది రోగులకు వైద్య సేవలందించారు. కీళ్ల నొప్పులు, జలుబు, జ్వరం, సుగర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ సూచనల మేరకు అన్ని గ్రామాల్లో 104 సంచార వాహనం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, 104 వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎంఈఓల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: మండల విద్యా శాఖాధికారుల సమస్యలు పరిష్కరించాలని ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సోమవారం గూగుల్ మీట్‌లో నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓలు వృత్తి పరంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సామల సింహాచలం మాట్లాడుతూ.. ఎంఈఓల జాబ్ చార్ట్ ఉత్తర్వులు సంఖ్య 89 ప్రకారం కాకుండా, ప్రభుత్వ ఉత్తర్వులకు భిన్నంగా అన్ని పనులు ఎంఈఓలు చేయాలని చాలా జిల్లాల్లో డీఈఓలు ఆదేశాలు ఇస్తుండటం వల్ల ఎంఈఓలు పని ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

రేవుల అభివృద్ధి


వేణుగోపాలస్వామి ఆలయ రేవు వద్ద జేసీబీతో చదును చేయిస్తున్న దృశ్యం

సీతానగరం: కార్తీక మాసంలో నదీస్నానాలకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తీర గ్రామాల పెద్దలు చర్యలు చేపడుతున్నారు. కార్తీక మాసంలో సీతానగరంలో సువర్ణముఖీ నది ఒడ్డున ఉన్న పంచముఖేశ్వర స్వామి, వేణుగోపాలస్వామి, లక్ష్మీనృశింహ స్వామి ఆలయాలకు వందలాది మంది భక్తులు వెళ్లి పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. భక్తులు వేకువజామున నదిలో స్నానాలు ఆచరించి దైవ దర్శనానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో నదిలో స్నానాల రేవును స్థానిక సర్పంచ్ జె.తేరేజమ్మ, ఇన్‌చార్జ్ ఈఓ ఇ.రమేష్ సోమవారం జేసీబీ సాయంతో బాగు చేయించారు. అలాగే చినభోగిలి రేవును స్థానిక సర్పంచ్ కె.రాధ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి పి.తిరుపతిరావు మరమత్తులు చేయించారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


108 వాహనం కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న క్షతగాత్రుడు మోహనరావు

సీతానగరం: మండలంలోని చినభోగిలి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. దత్తిరేజేరు మండలం మరడాం గ్రామానికి చెందిన జి.మోహనరావు తన భార్యతో కలిసి స్కూటీపై దుగ్గి గ్రామానికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా చినభోగిలి వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వ్యాన్ అదుపుతప్పి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న ఇరువురు గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గంట సమయం వరకు వేచి ఉన్నా 108 రాకపోవడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆటోలో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు.



అక్రమంగా ఇసుక రవాణా..


ఇసుక లారీల కారణంగా నారాయణపురం-పదమాయవలస మధ్య కుంగిపోయిన పైపుకల్వర్టు

- పాడవుతున్న రోడ్లు, కల్వర్టులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

బలిజిపేట: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరం జిల్లా వంగర మండలం కొండచాకరాపల్లి రేవు నుంచి గత 15 రోజులుగా రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లతో ఇసుక తరలిస్తున్నారు. కొండ చాకరాపల్లి రీచ్ నుంచి బంగారువలస, బలిజిపేట మండలంలో పెద్దింపేట, గౌరీపురం, నారాయణపురం, వెంగాపురం, మిర్తివలస, బర్లి మీదుగా బొబ్బిలి వైపు ఇసుక తరలిస్తున్నారు. ఇసుక రవాణా వాహనాలకు ఎలాంటి బోర్డులు లేకపోవడంతో ఇది అక్రమ రవాణాయే అని ఆయా గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీల కారణంగా నారాయణపురం, పెద్దింపేట, గౌరీపురం, వెంగాపురం, తదితర గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో నారాయణపరం శివాలయం నుంచి పదమాయవలస రోడ్డు వరకు ఉన్న కనెక్టింగ్ రోడ్డులో ఉన్న పైపు కల్వర్టు, రోడ్డు ఇసుక లారీల కారణంగా శిథిలమయ్యాయి. బీటీ రోడ్డు బీటలువారింది. రూ.33.11 లక్షలతో ఇటీవల నిర్మించిన ఈ రోడ్డు మూన్నాళ్లకే అవశాన దశకు చేరుకోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లను ఏవిధంగా ఇటువంటి సింగిల్ రోడ్లపై తీసుకువెళ్తారని నారాయణపురం గ్రామస్తులు నిలదీశారు. టిప్పర్లపై టార్పాలిన్లు కూడా కట్టకుండా ఇసుక తరలిస్తుండటంతో గాలికి ఇసుక రేణువులు ఎగిరిపడి వెనుక వస్తున్న వాహనచోదకుల కళ్లలో పడుతున్నాయి. దీని వల్ల వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై స్పందించాలని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.


నారాయణపురం వద్ద ఇసుక తరలిస్తున్న టిప్పర్లు

పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించుకుందాం..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం

పార్వతీపురంటౌన్: పార్టీ నిర్దేశించిన అభ్యర్థిని గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో సోమవారం పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మూడు మండలాలు, పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నిర్దేశించిన అభ్యర్థిని మనమంతా కలిసి గెలిపించుకుందామన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లకు ఎన్నిక ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. నోటిఫికేషన్ విడుదలైందని, 11న నామినేషన్, 14 వరకు ఉపసంహరణకు గడువు ఉందని, 28న పోలింగ్ జరుగుతుందన్నారు. పార్టీ ఓటర్లు అందరూ కూడా పార్టీ అధ్యక్షుడి పిలుపుమేరకు మన అభ్యర్థిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్‌లు యిండుపూరు గున్నేశ్వరరావు, కొండపల్లి రుక్మిణి, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జి, బలగ రేవతమ్మ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, బలగ రమణమ్మ, పురపాలక సంఘం పార్టీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, పాలవలస మురళీకృష్ణ, వైస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, బంకురి రవికుమార్, సిద్ద జగన్నాథం, బెవర హేమలత, సూర్యనారాయణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ సభ్యులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


పిచ్చిమొక్కల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న ఎస్సై రాజేష్

సీతానగరం: మండల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టిసారించినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు. చినభోగిరి నుంచి అప్పయ్యపేట వరకు ఉన్న రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, చెత్తకుప్పలను సోమవారం జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రహదారి మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అలాగే రోడ్డు భద్రత నిబంధనలపై, సైబర్ నేరాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలు తెలియజేయొద్దని సూచించారు. పోక్సో చట్టంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: రాష్ట్రంలో పురపాలక సంఘం, కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై విజయవాడలో ఈ నెల 10న నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాబూరావు, ఉమాశంకర్, అమర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహంతి వీధిలో అనధికార లేఅవుట్

సాలూరు: పట్టణంలోని 8వ వార్డు మహంతివీధిలో అనధికార లేఅవుట్‌ను గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ సోమవారం తెలిపారు. మహంతివీధిలో సర్వే నంబరు 162/4లో ఉన్న ఎకరం స్థలంలో వేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని సూచించారు. అనధికార లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టవిరుద్ధంగా పేర్కొన్నారు. ఆ స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయడం కానీ, భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయడం, రోడ్లు, విద్యుత్, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడం వంటివి జరగవన్నారు.

పశువులకు మిశ్రమ దాణాతో మేలు


పశుదాణా పంపిణీ చేస్తున్న జిల్లా పశు సంవర్ధకాధికారి డా.మన్మథరావు

పార్వతీపురంటౌన్: పాడిరైతులు తమ వద్ద ఉన్న పశువులకు మిశ్రమ దాణా ఇవ్వడం వల్ల ఖనిజ లవణాలతో పాటు విటమిన్లు తగిన మోతాదులో అందుతాయని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శివ్వల మన్మథరావు అన్నారు. మండలంలోని వెంకంపేట గ్రామంలో పాడిరైతులకు రాయితీపై దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాకు 125 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణాను కేటాయించగా.. పార్వతీపురం మండలానికి 23 టన్నుల దాణా వచ్చిందన్నారు. మిశ్రమ దాణాలో మొక్కజొన్నలు, సజ్జలు, రాగులు, ఉలవలు, శనగలు, చెక్కలు, వరి తవుడు, చెరకు మడ్డి, ఖనిజ లవణాలు, విటమిన్లు, ఉప్పు వంటి స్థూల పోషకాలుంటాయని వివరించారు. పచ్చిగడ్డి, ఎండుగడ్డి, దాణాలు కలిపి ఒకేసారి మిశ్రమ దాణాగా పశువులకు మేతగా పెడితే పశువుల జీర్ణక్రియ మెరుగ్గా ఉంటుందని, పాల ఉత్పత్తి శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. తద్వారా పాడి రైతులకు అధిక ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక పశు వైద్యాధికారి డా.ఆర్.రమేష్, డా.కె.ప్రసాద్, డా.బి.చక్రధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల బకాయిలు చెల్లించాలని వినతి


ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫోటోగ్రాఫర్లు

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న వీడియోగ్రాఫర్లకు డబ్బులు చెల్లించాలని ఫోటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, కొనపల అన్నాజీరావు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు 2024 సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న వీడియోగ్రాఫర్లకు అప్పటి తహసీల్దార్లు కొంత అడ్వాన్స్ సొమ్మును ఇచ్చారని, ఎలక్షన్ ఫండ్ వస్తే మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎలక్షన్ ఫండ్ వచ్చినా ఫొటో, వీడియోగ్రాఫర్లకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకుండా అధికారులు దాటవేసే ధోరణి ప్రదర్శిస్తున్నారని వాపోయారు. తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరుతూ పాలకొండ ఆర్డీఓకు, ఐటీడీఏ పీఓ, కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో పలుమార్లు వినతులు అందజేసినా ఇంతవరకు ఫలితం లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి వీడియోగ్రాఫర్లకు, టెంట్ హౌస్ నిర్వాహకులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, టెంట్ హౌస్ నిర్వహకుడు నీలాపు శ్రీనివాసరావు, ఫోటోగ్రాఫర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు

సీతానగరం/బలిజిపేట: కార్తీకమాసం మొదటి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణలో ఆలయాలు మార్మోగిపోయాయి. వేకువజామున సువర్ణముఖి నదిలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.


సీతానగరం: సువర్ణముఖేశ్వరస్వామి ఆలయంలో క్యూకట్టిన భక్తులు


బలిజిపేట: గలావల్లి శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కోడ్ కూసినా తొలగించరా..


డీలక్స్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం పక్కన తొలగించకుండా విడిచిపెట్టిన మంత్రి ఫ్లెక్సీ

సాలూరు:

కూటమి ప్రభుత్వ పెద్దల సేవలో తరిస్తున్న అధికారులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోడ్ అమలులోకి వచ్చిందన్న ధ్యాసే లేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ పట్టణంలో ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల ఫ్లెక్సీలు ఇంకా దర్శనమిస్తున్నాయి. మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలు పట్టణ ముఖద్వారం నుంచి మెయిన్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, పలు ప్రధాన కూడళ్లలో కనిపిస్తున్నాయి. వేంకటేశ్వర డీలక్స్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు ఆ పక్కనే ఉన్న మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీని తొలగించకుండా వదిలేయడం మంత్రి పట్ల వారికి ఉన్న విధేయతకు అద్దపడుతోందని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా సాక్షి విలేకరి ఈ ఫొటోలు తీయడాన్ని గమనించిన పలువురు నేతలు ఈ విషయాన్ని అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.


మెయిన్‌రోడ్డులో మామిడిపల్లి జంక్షన్ వద్ద ఉన్న మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీలు


కోర్టుకు వెళ్లే దారిలో ఉన్న టీడీపీ కూటమి ఫ్లెక్సీలు

మంత్రి ఆదేశాలు అమలు దిశగా అధికారుల చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

సాలూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించి మంత్రి సంధ్యారాణి ఆదేశాలు అమలు కాలేదని తెలుపుతూ సాక్షి పత్రికలో 'మాటలేనా మంత్రిగారు' అనే శీర్షికన సోమవారం ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించారు. ఈ మేరకు మున్సిపల్, సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించినట్లు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. 11వ వార్డులో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు తెలిపామన్నారు. సామాజిక మరుగుదొడ్లుకు సంబంధించి త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. సామాజిక మరుగుదొడ్లు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, వాటి నిర్వహణ బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించేలా చూడాలని కలెక్టర్ సూచించగా.. ఇక్కడ అటువంటి పరిస్థితులు లేవని, మున్సిపాలిటీ ద్వారా నిధులు సమకూర్చి నిర్వహణ బాధ్యతలు తీసుకుంటామని తెలిపామన్నారు. జీగిరాం జ్యూట్ ఫ్యాక్టరీపై కలెక్టర్ ఆరా తీసినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించరాదని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.


మాటలేనా మంత్రిగారు?

సాక్షిలో ప్రచురితమైన కథనం

బడిదేవరమ్మను కాపాడుకుందాం

- బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ పిలుపు
- రేపటి నుంచి 9 వరకు పాదయాత్ర

పార్వతీపురంటౌన్:

బడిదేవరకొండ తవ్వకాలను తక్షణమే నిలుపుదల చేయాలని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ తవ్వకాలకు మన ప్రాంతంతో సంబంధంలేని, కొంతమంది పెత్తందారులు, భూస్వాములు క్వారీ యజమానికి అనుమతుల లైసెన్స్ ఇవ్వడంతో ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కొండని తవ్వుకుపోవడం అన్యాయమని అన్నారు. తవ్వకాలను వెంటనే ఆపాలన్నారు. ఈ కొండ పార్వతీపురం మండలానికి జీవనాధారంగా నిలుస్తుందని, అది కొండ మాత్రమే కాదని, గిరిజనుల జీవనాడి అని అన్నారు. దాన్ని కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉన్నందన్నారు. ఇప్పటికే పలుమార్లు కొండ తవ్వకాలపై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. గతంలో అనుమతులను రద్దు చేసిన ప్రభుత్వాలే నేడు అనుమతులు ఇవ్వడం విడ్డూరమన్నారు.

పాదయాత్రకు సిద్ధం..

ఇచ్చిన లీజు లైసెన్సులు రద్దు చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. బుధవారం ఉదయం 11 గంటలకు పాత బస్టాండ్ నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. వెంకంపేట, చిన్నబొండపల్లి, ఎమ్మార్ నగరం, సంగంవలస, నడిమివలస, మడకావానివలస, గంగాపురం, కోరి, హిందూపురం, సూడిగం, పెదగొండపల్లి, దిబ్బగుడ్డివలస, పుట్టూరు, లచ్చిరాజుపేట, తాళ్లబురిడీ, చలమవలస, డి.ములగ, ఎన్.ములగ, కవిటిబద్ర, కారణాలములగ గ్రామాల మీదుగా పాదయాత్ర సాగుతుందన్నారు. ఈ పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.శ్రీనివాయుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.నర్సింగరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పి.రంజిత్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు ఆర్‌వీఎస్ కుమార్, భాష, చెరువుల సంరక్షణ కమిటీ నాయకులు వంగల దాలినాయుడు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.విశ్వేశ్వరరావు, అఖిల భారత గ్రామీణ ఉపాధి కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.


పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేస్తున్న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు: ఎస్పీ


ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి

పార్వతీపురంటౌన్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసినందున జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని, ఎన్నికల కోడ్ పక్కాగా అమలయ్యేలా అధికారులు చూడాలని జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజాప్రతినిధులు నిర్వహించే సమావేశాలకు హాజరు కావద్దని, సందర్శనలకు ప్రచారానికి వినియోగించే లౌడు స్పీకర్లుకు సంబంధిత అధికారుల నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్ అధికారుల సహకారంతో తొలగించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు సృష్టించేందుకు అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, బైండోవరు చేయాలని పోలీసులను ఆదేశించారు. అదే విధంగా సెక్షన్ 30 అమలులో ఉన్నందున అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కోడ్ ఉల్లంఘించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.